సాక్షి
రంగారెడ్డి

సోమవారం ׀ 31 ׀ జూలై ׀ 2023



ఆరోగ్యం..జర భద్రం

వర్షాకాలం ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటేనే వ్యాధుల నుంచి బయట పడొచ్చని వైద్యులు సూచిస్తున్నారు. 8లో▸



బ్రాహ్మణులను ఆదుకోవాలి

రాష్ట్రంలో పేద బ్రాహ్మణులను ఆదుకోవాలని బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ మాజీ అధ్యక్షుడు రామారావు ప్రభుత్వాన్ని కోరారు. 8లో▸



అంగన్‌వాడీపై కోతుల దాడి

కోతుల గుంపు అంగన్‌వాడీలో చొరబడి ఆయా, టీచర్‌పై దాడి చేసి గాయపరిచాయి. ఈ ఘటన రాయపోల్‌లో జరిగింది. 8లో▸

న్యూస్‌రీల్

గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు



గ్రంథాలయ భవనానికి స్థలాన్ని పరిశీలిస్తున్న వెంకట రమణారెడ్డి తదితరులు

మహేశ్వరం: గ్రంథాలయాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి అన్నారు. మండల పరిధిలోని కేసీ తండా సమీపంలో నూతన గ్రంథాలయ భవన నిర్మాణం కోసం ఆదివారం స్థానిక సర్పంచ్, గ్రంథాలయ శాఖ అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి నియోజకవర్గం, మండలాల్లో గ్రంథాలయాలను అభివృద్ధి చేస్తామన్నారు. కేసీ తండాలోని సర్వే నంబర్ 306లో రూ.కోటి నిధులతో అధునాత గ్రంథాలయ భవనం నిర్మాంచేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న యువతకు, ఐటీ తదితర రంగాలకు శిక్షణ పొందే యువతకు ఉపయోగపడేలా ఈ గ్రంథాలయాన్ని తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి మనోజ్ కుమార్, సర్పంచ్ మోతిలాల్ నాయక్, లైబ్రేరియన్ ప్రతాప్ పాల్గొన్నారు.

'స్వచ్ఛ భారత్ మిషన్' భేష్



రాయపోల్‌లో పర్యటిస్తున్న కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ప్రతినిధి శివప్రసాద్

ఇబ్రహీంపట్నం రూరల్: స్వచ్ఛభారత్ మిషన్ పనితీరు బాగుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ప్రతినిధి శివప్రసాద్ కితాబిచ్చారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ అభియాన్‌లో భాగంగా ఆదివారం ఆయన జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి రాయపోల్, మందగూడ, దొండగూడ గ్రామాల్లో పర్యటించారు. మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలను పరిశీలించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ.. బహిరంగ మలమూత్ర విసర్జన లేకుండా నూరు శాతం మరుగుదొడ్ల వాడకం బాగుందన్నారు. వర్షకాలంలో ఇంకుడు గుంతల్లో నీరు ఇంకేలా చూసుకోవాలని తద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయని సూచించారు. డంపింగ్‌యార్డులు, నిరంతరం చెత్త సేకరణ లాంటి పనులు పంచాయతీల్లో సక్రమంగా చేస్తున్నారని సర్పంచ్ బల్వంత్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ సంధ్యారాణి, ఇన్‌చార్జి ఎంపీడీఓ కాంత్రి కిరణ్, ఎంపీఓ లక్పతినాయక్, ఎంపీటీసీలు జ్యోతి, శ్రీశైలం, ఉప సర్పంచ్ బాల్‌రాజ్, వార్డు సభ్యులు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

ఇండియన్ ఆర్మీ ఈవెంట్స్‌కు ఉచిత శిక్షణ

హుడాకాంప్లెక్స్: ఇండియన్ ఆర్మీలో ప్రిలిమ్స్‌లో ఎంపికై ఈవెంట్స్ కోసం సిద్ధమవుతున్న విద్యార్థులకు నందు ఆర్మీ ఫౌండేషన్ ఉచిత శిక్షణ ఇస్తుందని చైర్మన్ నందులాల్ నాయక్ తెలిపారు. సరూర్‌నగర్ స్టేడియంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఈవెంట్ కోసం అద్భుతమైన ట్రాక్ సౌకర్యం కలిగి ఉన్నట్లు చెప్పారు. ఉదయం, సాయంత్రం ఫిజికల్ ఈవెంట్ నిర్వహించబడుతుందని, తెలంగాణలో జరిగిన ఎస్‌ఐ, పీసీ ఈవెంట్లలో దాదాపు 1,700 మంది విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. ఇండియన్ ఆర్మీ ఈవెంట్స్‌కి ప్రత్యేకమైన శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆగస్టు 1 నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని వివరించారు.



చల్లంగ చూడమ్మా..

కడ్తాల్ మండలం గోవిందాయిపల్లి తండాలో ఆదివారం గిరిజనులు ముత్యాలమ్మ బోనాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గిరిజన మహిళలు బోనం కుండలతో గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా ఊరేగింపు నిర్వహించారు. డీజే, డప్పుల దరువు, యువతీ యువకుల నృత్యాలు, కోలాటలు, గిరిజన మహిళల సాంప్రాదాయ నృత్యాలు, పోతురాజుల వేష ధారణ, విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. భక్తులు ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకుని నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. చల్లగా చూడాలని మొక్కుకున్నారు.

– కడ్తాల్

'చేతులు' కలిసేనా ?

మహేశ్వరం కాంగ్రెస్‌లో ఆశావహులెందరో..

- తమకే టికెట్ దక్కుతుందని ధీమా
- ఎవరికి వారే ప్రత్యేక కార్యక్రమాలు
- ఎటు వెళ్లాలో తెలియక కేడర్‌లో అయోమయం



సాక్షి, రంగారెడ్డిజిల్లా: మహేశ్వరంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి 'హస్త'వ్యస్తంగా తయారైంది. క్షేత్రస్థాయిలో పార్టీకి బలమైన కేడర్ ఉన్నప్పటికీ.. ఇక్కడి నేతల 'చేతులు' మాత్రం కలవడం లేదు. ఎవరికి వారే ప్రత్యేక ఎ'జెండా'తో ముందుకు సాగడంపై పార్టీ కార్యకర్తల్లో అయోమయం నెలకొంది. ఒక వైపు కొత్తగా వలసలు.. ఏళ్లుగా నియోజకవర్గాన్ని నమ్ముకుని పని చేస్తున్న లీడర్లకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుండగా.. మరోవైపు నేతల మధ్య నెలకొన్న అంతర్గత విభేదాలతో గందరగోళం నెలకొంది. సంక్షోభ సమయంలో పార్టీకి పెద్ద దిక్కుగా.. కార్యకర్తలకు అండగా నిలబడి.. ఎప్పటికప్పుడు కార్యక్రమాలు నిర్వహిస్తూ.. ఆర్థికంగా ఖర్చులు భరిస్తూ పార్టీని బలోపేతం చేస్తే.. తీరా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత తమను కాదని, కొత్త నేతలకు టికెట్ కట్టబెడితే తమ రాజకీయ భవితవ్యం ఏమిటనే భావన ఆ పార్టీ నేతలను వేధిస్తోంది.

తమదైన ముద్ర వేసేందుకు..

డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి వచ్చే ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుంచి తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలని భావిస్తున్నారు. ఆయన మీర్‌పేట్, జిల్లెలగూడ, చంపాపేట్‌లో తరచూ పర్యటిస్తున్నారు. ఆయా కేంద్రాలుగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఆర్కేపురం నుంచి కార్పొరేటర్‌గా పని చేసిన అనుభవం ఉన్న పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దేప భాస్కర్‌రెడ్డి నిత్యం ప్రజల మధ్యే ఉంటున్నారు. పార్టీ నుంచి ఈసారి ఎమ్మెల్యే టికెట్ తనకే లభిస్తుందని చెబుతున్నారు. ఈయనకు జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఆర్కేపురం, సరూర్‌నగర్ డివిజన్లతో పాటు మహేశ్వరం మండలంపై కొంత పట్టుంది. రాజకీయంగా మంత్రి సబితతో విభేదించి ఏడాది క్రితం బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి దంపతులు వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్నారు. బడంగ్‌పేట్, బాలాపూర్, జల్‌పల్లి కేంద్రంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లో ఇదే నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ తరఫున పోటీచేసి ఓటమి పాలైన కొత్త మనోహర్‌రెడ్డి సైతం ఇటీవల ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఆయన పదేళ్లుగా కేఎంఆర్ ట్రస్ట్ పేరుతో పుస్తెమెట్టెలు, నూతన వస్త్రాల పంపిణీ, పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ పేరుతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వర్గంగా గుర్తింపు పొందిన ఆయన కూడా ఈసారి టికెట్ తనకే వస్తుందని చెబుతున్నారు. గతంలో ఎమ్మెల్యేగా పోటీ చేసిన ఎల్మటి అమరేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి సైతం పోటీకి సై అంటున్నారు.

ఊగిసలాటలో తీగల

గతంలో హైదరాబాద్ మేయర్‌గా, మహేశ్వరం ఎమ్మెల్యేగా పని చేసిన బీఆర్‌ఎస్ నేత తీగల కృష్ణారెడ్డి తన రాజకీయ భవితవ్యంపై ఎటూ తేల్చుకోలేక పోతున్నారు. అధికార బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఇప్పటికే కేడర్‌కు సంకేతాలు ఇచ్చినప్పటికీ.. ఆయన నిర్ణయాన్ని ఇటు హస్తం పార్టీ స్థానిక నేతలే కాదు.. స్వయంగా కుటుంబ సభ్యులు సైతం వ్యతిరేకిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఆయన కోడలు, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి కూడా అధికార బీఆర్‌ఎస్ పార్టీని వీడి ఆయనతో కలిసి వెళ్లేందుకు సుముఖంగా లేనట్లు సమాచారం.

సబితతో సవాలే..

నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2009లో మహేశ్వరం నియోజకవర్గం ఏర్పాటైంది. తొలిసారిగా జరిగిన ఎన్నికల్లో పటోళ్ల సబితారెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 2009లో మొత్తం 2,86,974 ఓట్లు ఉండగా, 1,74,911 పోలయ్యాయి. టీడీపీ నుంచి పోటీ చేసిన తీగల కృష్ణారెడ్డికి 57,244 పోలవగా, సబిత 65,077 ఓట్లతో విజయం సాధించారు. 2014 ఎన్నికల్లో 4,03,719 ఓట్లకు, 2,17, 299 పోలయ్యాయి. టీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త మనోహర్‌రెడ్డికి 42,517 ఓట్లు పోలవగా, కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డికి 62,521 పోలయ్యాయి. టీడీపీ అభ్యర్థి తీగల కృష్ణారెడ్డి 93,305 ఓట్లతో విజయం సాధించారు. 2018లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు 39,445 ఓట్లు (16.84 శాతం) సాధించగా, టీఆర్‌ఎస్ అభ్యర్థి తీగల కృష్ణారెడ్డి 86,254 ఓట్లు (36.82 శాతం) సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి సబితారెడ్డి 95,481 ఓట్లతో(40.76 శాతం) విజయం సాధించారు. అనంతరం చోటు చేసుకున్న రాజకీయ సమీకరణాల్లో భాగంగా ఆమె కాంగ్రెస్‌ను వీడి.. అధికార బీఆర్‌ఎస్‌లో చేరారు. ప్రస్తుతం జిల్లా నుంచి రాష్ట్ర కేబినేట్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రభుత్వం నుంచి నియోజకవర్గానికి భారీగా నిధులు తెప్పించి, అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో ముందున్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్న ఆమెను వచ్చే ఎన్నికల్లో 'ఢీ' కొట్టడం కాంగ్రెస్‌కు అంత సులువు కాదనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది.



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న టీఎస్సీపీఎస్ఈయూ నాయకులు

సీపీఎస్‌ను రద్దు చేయాలి

- పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి
- ఉపాధ్యాయ, ఉద్యోగ రంగ సమస్యలు పరిష్కరించాలి
- టీఎస్సీపీఎస్ఈయూ రాష్ట్ర అధ్యక్షురాలు స్థితప్రజ్ఞ

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో కొనసాగుతున్న సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని టీఎస్సీపీఎస్ఈయూ రాష్ట్ర అధ్యక్షురాలు స్థితప్రజ్ఞ అన్నారు. టీఎస్సీపీఎస్ ఈయూ ఆధ్వర్యంలో తలపెట్టిన పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర ఆదివారం షాద్‌నగర్ పట్టణానికి చేరుకుంది. ఈ యాత్రకు సీపీఎస్ ఉద్యోగులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పట్టణంలోని సాయిబాబ దేవాలయం నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. పట్టణ ముఖ్యకూడలిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో స్థితప్రజ్ఞ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని అన్నారు. రాష్ట్రంలో సీపీఎస్ ఉద్యోగుల సంఖ్య రెండు లక్షలకు చేరిందని, ఉద్యోగులందరు ముక్తకంఠంతో సీపీఎస్ రద్దును కోరుకుంటున్నారని అన్నారు. గతంలో చేపట్టిన పోరాటాల ఫలితంగా సీపీఎస్ ఉద్యోగులకు గ్రాట్యుటీ సౌకర్యం, ఫ్యామిలీ పెన్షన్ సాధించుకోవడం జరిగిందని గుర్తు చేశారు. ప్రస్తుతం అభీ నహీతో.. కభీనహీ నినాదంతో పాత పెన్షన్ సాధనకోసం సంకల్ప రథయాత్రను చేపట్టినట్లు చెప్పారు. రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్, పంజాబ్, జార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో కొనసాగుతున్న ఓపీఎస్ విధానాన్ని రాష్ట్రంలో అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎస్సీపీఎస్ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు దర్శన్ గౌడ్, పవన్, ప్రధాన కార్యదర్శి కల్వాల్ శ్రీకాంత్, కోశాధికారి నరేశ్‌గౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శి రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

మా భూములు మాగ్గావాలె..

దావుత్‌ఖాన్‌గూడలో భూ నిర్వాసితుల ధర్నా

బడంగ్‌పేట్: తమ భూములు తమకు ఇచ్చేయాలంటూ దావుత్‌ఖాన్‌గూడలో బడంగ్‌పేటకు చెందిన దళితులు ఆదివారం ధర్నా నిర్వహించారు. వృద్ధులతో పాటు చిన్నారులు సైతం ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. నిజాం నవాబుల కాలంలో దుప్పు కొట్టే దళిత కుటుంబాలకు సుమారు 40 ఎకరాలు కేటాయించారని పేర్కొన్నారు. ఏళ్ల తరబడి అదే భూమిని సాగుచేసుకుంటూ దళిత కుటుంబాలు జీవిస్తున్నామన్నారు. బడంగ్‌పేట అభివృద్ధి కార్యక్రమాలకు పోగా ఇంకా 16 ఎకరాలు ఓపెన్‌గా భూమి ఉందని అన్నారు. ఈ భూమిని కబ్జాలో ఉన్న దళిత కుటుంబాలు ఇళ్లు నిర్మించుకునేందుకు అనుమతులు ఇవ్వాలని అన్నారు. మీర్‌పేట పోలీసులు దావుత్‌ఖాన్‌గూడకు చేరుకుని ధర్నా చేస్తున్నవారిని అరెస్ట్ చేసి హయత్‌నగర్ పీఎస్‌కు తరలించారు. అరెస్ట్ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ చిగురింత నర్సింహారెడ్డి, బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, ఎల్‌బీనగర్ బీఎస్పీ నాయకులు స్టేషన్‌కు చేరుకుని బాధితులను పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.



నిర్వాసితులతో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

బాధితులకు అండగా ఉంటాం

అబ్దుల్లాపూర్‌మెట్: బడంగ్‌పేట రెవెన్యూ పరిధిలోని దావుత్‌ఖాన్ గూడలో ఆందోళన చేస్తున్న దళితులను మీర్‌పేట పోలీసులు హయత్‌నగర్‌కు తరలించారు. హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న బీజేపీ మహేశ్వరం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ పార్టీ నాయకులతో కలిసి వచ్చి బాధితులకు అండగా నిలిచారు. పోలీసులు ఆయనను బయటికి పంపించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులు, బీజేపీ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. ఇదే సమయంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ హయత్‌నగర్ పీఎస్‌కు వచ్చి బాధితులను పరామర్శించారు. అనంతరం ఈటల రాజేందర్, అందెల శ్రీరాములు మాట్లాడుతూ.. బాధితులకు అండగా ఉంటామని, దళితులపై ఇలాంటి చర్యలకు పాల్పడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. మంత్రి తమ అనుచరులకు ఈ భూములను కట్టబెట్టేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, నాయకులు చింతల సురేందర్ యాదవ్ తదితరులు పాల్గన్నారు.

ఆరోగ్యం..జర భద్రం

అసలే వర్షాకాలం వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువ. డెంగీ, మెదడువాపు, మలేరియా, బోదకాలు వంటి వ్యాధుల నియంత్రణకు దోమతెర, జాలీలు వాడాల్సి ఉంటుంది. ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటేనే వ్యాధుల నుంచి బయట పడొచ్చని వైద్యులు సూచిస్తున్నారు. దీనిపై కథనం..


షాబాద్‌లో ఇళ్ల మధ్య ప్రవహిస్తున్న మురుగు

షాబాద్: కూలెక్స్ దోమ వల్ల మెదడు వాపు వ్యాధి వస్తుంది. దోమ కుట్టిన పది రోజుల్లోపు లక్షణాలు బయటపడతాయి. ముఖ్యంగా 1నుంచి 14 ఏళ్ల పిల్లలకు వచ్చే అవకాశముంది. జ్వరం తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అసాధారణంగా కళ్లు తిరుగుతాయి. పక్షవాతానికి గురయ్యే ప్రమాదముంది. వాంతులు, విరేచనాలు అవుతాయి.

జాగ్రత్తలు ఇలా..

దోమ తెర వాడాలి. దోమలు ఇళ్లల్లోకి రాకుండా కిటికీలు, తలుపులు, సన్నటి జాలీలతో బిగించుకోవాలి. జనావాసాల మధ్యన పందులు సంచరించకుండా చూసుకోవాలి. మురుగు, ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వఉండకుండా చర్యలు చేపట్టాలి. పిల్లలకు జ్వరం వస్తే వెంటనే వైద్య పరీక్షలు చేయించాలి.

బోదకాలు లక్షణాలు..

తరచూ కొద్దిపాటి జ్వరం, ఆయాసం బోదకాలు ప్రాథమిక లక్షణాలు. పురుషులలో వరి బీజం ఏర్పడుతోంది. గజ్జల్లో వాపు వస్తోంది. నిర్ధారణకు రాత్రి సమయంలో రక్త నమూనాలు సేకరిస్తారు. బాధితుడు విశ్రాంతి సమయంలో పరాన్న జీవులు రక్త ప్రసరణ వ్యవస్థలోకి ప్రవేశిస్తాయి. 5 నెలల్లో ప్రౌఢ జీవులుగా వృద్ధి చెందుతాయి. ఇలా శరీరంలో 6ఏళ్ల పాటు జీవించే ఈ పరాన్న జీవులు లక్షల సంఖ్యలో ఉత్పత్తయి శోషణ వ్యవస్థలోకి చేరతాయి. దీంతో శరీర అవయవాలు అసాధారణ వాపునకు గురవుతాయి.

జాగ్రత్తలు..

నివారణకు ప్రధానంగా దోమలను నిర్మూలించాలి. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. వ్యాధి నివారణకు డీఈసీ మాత్రలు పంపిణీ చేస్తున్నారు. ఈ మాత్రల ద్వారా శరీరంలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతోంది.

చికెన్ గున్యా లక్షణాలు..

చికెన్ గున్యా జ్వరం పగటి పూట కుట్టేపులి దోమ ద్వారా వస్తోంది. తీవ్రమైన జ్వరం, విపరీతమైన కీళ్ల నొప్పులుంటాయి. ఈ వ్యాధి సోకినప్పుడు భరించలేని ఒళ్లు, కీళ్ల నొప్పులు, జలుబు ఉంటుంది. వెంటనే అశ్రద్ధ చేయకుండా వైద్యుడిని సంప్రదించాలి.

డెంగీ లక్షణాలు..

ఏడీస్ ఈజిప్టి వైరస్ దోమ వల్ల ఒకరి నుంచి మరొకరికి డెంగీ వైరస్ వ్యాప్తి చెందుతోంది.

అప్రమత్తతతోనే రక్ష

- అవగాహనతోనే వ్యాధులు దూరం
- పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి

దోమ తెరలు వినియోగించాలి..



ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి. దోమల నివారణకు కాయిల్స్, లిక్విడ్స్ వేప రేంజర్ల కన్నా దోమ తెరలు వినియోగిస్తే ఫలితం ఉంటుంది. ముఖ్యంగా పరిసరాలతో పాటు వ్యక్తిగతంగానూ పరిశుభ్రంగా ఉండాలి.

– డాక్టర్ వరలక్ష్మి, చందనవెల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి

దోమ కుట్టిన తర్వాత 5 నుంచి 8 రకాల లక్షణాలు కనిపిస్తాయి. ఉన్నట్టుండి జ్వరం ఎక్కువగా వస్తోంది. తలనొప్పి అధికమవుతోంది. కంటి కదలికల సమయంలో భరించలేని నొప్పి ఉంటోంది.

మలేరియా లక్షణాలు..

సాయంత్రం పూట జర్వం రావడం, చలి వణుకు ఉంటోంది. ఈ లక్షణాలను బట్టి చికిత్స చేయించాలి. రక్త పరీక్ష చేసిన వెంటనే మలేరియా క్రిములు కనబడవు. శరీరంలోకి ప్రవేశించిన తర్వాత కొద్ది రోజులకు మాత్రమే ఇవి రక్త పరీక్షల్లో బయటపడతాయి.

‘అంగన్‌వాడీల’పై కోతుల దాడి


క్షతగాత్రులను పరామర్శిస్తున్న బుగ్గరాములు


కోతుల దాడిలో గాయపడ్డ ఆయా తహేరబేగం

టీచర్, ఆయాలకు గాయాలు

ఇబ్రహీంపట్నం రూరల్: కోతులు గుంపులుగా వచ్చి అంగన్‌వాడీలో చొరబడి ఆయా, టీచర్‌పై దాడి చేసి గాయపరిచాయి. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం మండలంలోని రాయపోల్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..రాయపోల్ గ్రామంలో ఓడీఎఫ్ బృందం పర్యటిస్తుండగా అంగన్‌వాడీ కేంద్రానికి వస్తారేమోనని అంగన్‌వాడీ టీచర్ భారతమ్మ, ఆయా తహేరబేగంలు అంగన్‌వాడీ కేంద్రాన్ని తీసి శుభ్రం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయా తహేర బేగం బయటకు వచ్చి చెత్త పడేస్తుండగా ఒక్కసారిగా కోతుల గుంపు వెంబడించింది. అంగన్‌వాడీలోకి వెళ్తుండగా టీచర్ భారతమ్మ అడ్డు వచ్చింది. ఈ ఘటనలో ఇద్దరిపై కోతుల గుంపు దాడి చేశాయి. వారిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు.

క్షతగాత్రులను పరామర్శించిన సీఐటీయూ నాయకులు

కోతుల దాడిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను సీఐటీయూ మండల కార్యదర్శి బుగ్గరాములు పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి సిబ్బందిని కోరారు.

బీఆర్ఎస్ పాలనలో విద్యావ్యవస్థ నిర్వీర్యం


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు

ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు పుట్నాలసాయికుమార్

షాద్‌నగర్‌రూరల్: బీఆర్ఎస్ పాలనలో విద్యావ్యవస్థ పూర్తిగా నిర్వీర్యంమవుతుందని ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు పుట్నాలసాయికుమార్ అన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ విద్యా వ్యతిరేక పాలనను నిరసిస్తూ ఆదివారం ఏబీవీపీ షాద్‌నగర్ నగరశాఖ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్నాలసాయికుమార్ మాట్లాడుతూ ఎంతోమంది అమరుల త్యాగాల పునాదుల మీద ఏర్పడిన తెలంగాణలో అమరుల త్యాగాలకు తూట్లు పొడిచే విధంగా పాలన కొనసాగుతుందన్నారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థ పూర్తిగా విధ్వంసానికి గురైందని ఆరోపించారు. ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకుంటే మన ఉద్యోగాలు మనకే వస్తాయని ఆశించిన నిరుద్యోగులకు ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో నిరాశే మిగిలిందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో బోధన, బోధనేతర ఖాళీలను భర్తీ చేసేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సాయిరాం, రాకేష్, జగదీష్, పవన్, నవీన్, సాయి, శ్రీకాంత్, బన్నీ, శివ, అభిషేక్, సాయి పాల్గొన్నారు.

మూడో విడత గొర్రెల పంపిణీ చేపట్టాలి

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు అమ్డాపూర్ గొల్ల, కురుమల వినతి


మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో మాట్లాడుతున్న గొల్ల, కురుమ నాయకులు

మొయినాబాద్‌రూరల్: మూడో విడత గొర్రెల పంపిణీని చేపట్టాలని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో అమ్డాపూర్ గొల్ల, కురుమలు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామ గొల్ల, కురుమ నాయకులు మంత్రిని కలిసి మూడో విడత గొర్రెల పంపిణీ చేపట్టాలని మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి స్పందించి రాష్ట్రంలోని గొల్ల, కురుమ రైతులందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. వారి ఆర్థిక అభివృద్ధే ధ్యేయంగా గొర్రెల పంపిణీ చేస్తున్నామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ అన్ని కులాల అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా పనిచేస్తున్నారని మంత్రి తలసాని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అమ్డాపూర్ గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీ కొని..వాహనదారుడి మృతి

నందిగామ: అకస్మాత్తుగా లారీని ఒక వైపునకు మళ్లించడంతో లారీని ఢీ కొని ద్విచక్రవాహనదారుడు మృతి చెందాడు. ఇన్‌స్పెక్టర్ సురేష్ కథనం ప్రకారం.. చౌదరిగూడ మండలం గుంజల పహాడ్ గ్రామానికి చెందిన వడ్ల శ్రీనివాస్(40) నందిగామ శివారులోని క్రియేటివ్ పాలిఫ్యాక్ పరిశ్రమలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి డ్యూటీకని బైక్‌పై నందిగామ నుంచి కొత్తూరువైపునకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో తహసీల్దారు కార్యాలయం ఎదురుగా టీ టైం హోటల్ పక్కన లారీడ్రైవర్ ఎలాంటి ఇండికేటర్ వేయకుండా అకస్మాత్తుగా లారీని ఒక వైపునకు మళ్లించాడు. దీంతో వెనుకాలే వస్తున్న శ్రీనివాస్ తన బైక్‌తో లారీకి ఢీ కొట్టాడు. ఈ ఘటనలో శ్రీనివాస్ తలకు గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య వడ్ల సరస్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె..


పాడి గేదె కళేబరం

షాబాద్: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై పాడి గేదె మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..బొనగిరిపల్లి గ్రామానికి చెందిన లింగాల బాలయ్య తన పాడి గేదెకు మేత మేయించడానికి ఆదివారం పొలానికి తీసుకెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు విద్యుత్ ఫెన్సింగ్ వైర్ తగలడంతో మృతి చెందింది. పాడి గేదె విలువ సుమారు రూ.75వేల వరకూ ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత రైతు లింగాల బాలయ్య కోరాడు.

రాయికోల్ టోల్‌ప్లాజా వద్ద..


గుర్తు తెలియని మృతదేహం

షాద్‌నగర్‌రూరల్: లారీ ఢీకొన్న ఘటనలో గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాయికల్ టోల్‌ప్లాజా సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ దేవకి తెలిపిన వివరాల ప్రకారం..గుర్తు తెలియని యువకుడు(26) రాయికల్ టోల్‌ప్లాజా సమీపంలోని ఓ దాబహోటల్ నుంచి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో జడ్చర్ల వైపునుంచి షాద్‌నగర్ వైపునకు వెళుతున్న లారీ ఆ యువకుడిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలైన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వివరాలకోసం ప్రయత్నించినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులు మృతదేహాన్ని షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎవరికైనా మృతుడి ఆచూకీ తెలిస్తే పూర్తి సమాచారం కోసం పోలీసులను సంప్రదించాలని కోరారు. ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పేకాట స్థావరంపై ఎస్ఓటీ పోలీసుల దాడి

ఏడుగురి అరెస్ట్


పేకాట ఆడుతూ పట్టుబడ్డ నిందితులు

ఇబ్రహీంపట్నం రూరల్: పేకాట స్థావరంపై మహేశ్వరం జోన్ ఎస్ఓటీ పోలీసులు దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి నగదుతో పాటు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి..ఇబ్రహీంపట్నం సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..చర్లపటేల్‌గూడ గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారంతో మహేశ్వరం జోన్ ఎస్ఓటీ పోలీసులు దాడి చేశారు. చర్లపటేల్‌గూడకు చెందిన ఆర్.శ్రీశైలం, ఎ.మల్లేష్, కె.శ్రీనివాస్, ఎస్.జంగయ్య ఎంపీపటేల్‌గూడకు చెందిన కె. శ్రీనివాస్, పి.బాల్‌రాజ్, పోచారానికి చెందిన డి.రామకృష్ణలను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.27,360 నగదు, మూడు సెట్ల కార్డులు, ఎనిమిది మొబైల్ ఫోన్లు, నాలుగు ద్విచక్ర వాహనాలు, కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అదుపులో అనుమానితులు

శంషాబాద్: బంగారం అక్రమ రవాణాకు పాల్పడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు ముగ్గురు మహిళలు, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పాతబస్తీకి చెందిన ఓ వ్యక్తి విజిటింగ్ వీసాలపై దుబాయ్, గల్ఫ్ దేశాలకు పంపి అక్రమంగా బంగారం తీసుకొచ్చి హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారనే సమాచారం రావడంతో రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు ఆదివారం ఉదయం విదేశాల నుంచి వచ్చిన ముగ్గురు మహిళలతో పాటు మరో ఇద్దరు వ్యక్తులను శంషాబాద్ ఎయిర్‌పోర్టు బయట అదుపులోకి తీసుకుని ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. అదుపులోకి తీసుకున్న వారెవరి వద్ద కూడా సంఘటన స్థలంలో బంగారం పట్టుబడలేదు. దీంతో పోలీసులు వారి ఫోన్‌లను స్వాధీనం చేసుకుని క్షుణ్ణంగా విచారణ చేపడుతున్నారు. బంగారం అక్రమ రవాణా ముఠాను ఛేదించేందుకు లోతుగా విచారిస్తున్నారు. ఎస్ఓటీ పోలీసులు, పోలీసులు వివరాలను అధికారికంగా వెల్లడించడం లేదు.

రైలు ప్రయాణికుడి నుంచి రూ.50 వేలు చోరీ

నాంపల్లి: రాజస్థాన్ నుంచి హైదరాబాదుకు ప్రయాణించే జైపూర్–అజ్మీర్–హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ రైలులో దొంగలుపడ్డారు. ఓ ప్రయాణికుడి జేబును కత్తిరించి రూ.50 వేలు దోచుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..రాజస్థాన్‌కు చెందిన వ్యాపారి సుమిత్ చంద్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 28న సాయంత్రం ఐదున్నర గంటలకు అజ్మీర్ రైలు ఎక్కారు. అందరూ (ఎస్–6) బోగీలోని 26, 27, 29, 30 బెర్తుల్లో కూర్చున్నారు. అజ్మీర్ నుంచి బయలుదేరిన రైలు 30న తెల్లవారుజామున హైదరాబాద్‌కు చేరుకుంది. బెర్తు నంబరు–30లో కూర్చున్న సుమిత్‌చంద్ ప్యాంటు జేబును దొంగలు కత్తిరించి అందులోని రూ.50 వేలు నగదు దోచుకెళ్లారు. హైదరాబాదు రైల్వే స్టేషన్‌లో దిగిన అతడు నాంపల్లి జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జేబులో అన్నీ రూ.500 నోట్లు కాగితాలే ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎవరు కత్తిరించారో తెలియదని, కత్తిరించినట్లు కూడా తనకు తెలియలేదని వాపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు జీరో ఎఫ్ఐఆర్‌ను నమోదు చేశారు. ఈ కేసును రాజస్తాన్ రాష్ట్రంలోని అజ్మీర్ పోలీసు స్టేషన్‌కు బదలాయించారు.

పేద బ్రాహ్మణులను ఆదుకోవాలి


సమావేశంలో బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ నాయకులు

బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ మాజీ అధ్యక్షుడు రామారావు

షాద్‌నగర్: రాష్ట్రంలో పేద బ్రాహ్మణులను ఆదుకోవాలని బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ మాజీ అధ్యక్షుడు రామారావు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణుల్లో ఎంతో మంది పేదలు ఉన్నారని వారిని గుర్తించి ప్రభుత్వం చేయూతనందించాలని కోరారు. ఇళ్లులేని నిరుపేద బ్రాహ్మణులకు డబుల్ బెడ్రూం ఇవ్వాలని, 60సంవత్సరాల వారికి పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. ఆగస్టు 15న ఏర్పాటుచేసే నియోజకవర్గ స్థాయి బ్రాహ్మణ సమావేశానికి అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సుధాకర్‌శర్మ, చిదంబరశర్మ, వేణుగోపాల్‌రావు, రామసత్యనారాయణ శర్మ, భానుశర్మ, నర్సింహ్మశర్మ, వెంకటాచార్యులు, మాదిరాజుప్రవీణ్, కిరణ్‌కుమార్, శివసాయిశర్మ, నరేందర్‌రావు, రఘుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

మహాజన సోషలిస్టు పార్టీ అధ్యక్షుడు తీగల ప్రదీప్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న తీగల ప్రదీప్‌గౌడ్

యాచారం: రాజ్యాంగ సవరణ ద్వారా ఎస్సీ వర్గీకరణకు పార్లమెంట్ సమావేశాల్లో చట్టబద్ధత కల్పించాలని మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తీగల ప్రదీప్‌గౌడ్ పేర్కొన్నారు. యాచారం మండల కేంద్రంలో ఆదివారం ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్టు పార్టీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం జరిగే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును పాస్ చేయించాలని డిమాండ్‌చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 341ని చేర్చడం ద్వారా రాష్ట్రాల్లో వర్గీకరణ చేసుకునే అవకాశం ఉంటుందని గుర్తు చేశారు. వర్గీకరణ చేసే వరకూ ప్రధాని నరేంద్రమోదీపై తీవ్ర ఒత్తిడి తెస్తామన్నారు. సీఎం కేసీఆర్ హామీ ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఈ ఎన్నికల్లో ఆయనకు తగిన గుణపాఠం చెబుతామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో పోతుగంటి కృష్ణ, కొమ్ము మహేష్, సిద్దాపురం శ్రీకాంత్, మూలి మహేష్, మంద లింగం, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో యాదవులు రాణించాలి

జిల్లా అధ్యక్షుడు బర్లజగదీష్ యాదవ్

మంచాల: రాజకీయాల్లో యాదవులు రాణించాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు బర్ల జగదీష్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం మంచాల మండలంలోని లింగంపల్లి గ్రామంలో నిర్వహించిన యాదవ మహాసభ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవులు రాజకీయంగా మరింత ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఎదిగితేనే రాజ్యాంగ బద్ధంగా మన హక్కులు సాధించుకోగలమని సూచించారు. అనంతరం లింగంపల్లి గ్రామంలో యాదవ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బురుగు లింగం యాదవ్, ప్రధాన కార్యదర్శిగా బద్దుల లక్ష్మణ్ యాదవ్, యూత్ అధ్యక్షుడిగా నర్ల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా బద్దుల సాయి యాదవ్‌లను నియమించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు గజ్జి ఐలయ్య, జెనిగె వెంకటేష్ యాదవ్, ఐలయ్య, నర్సింహా, రాజేష్, మహేందర్, కుమార్, శ్రీశైలం, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.


అఖిల భారత యాదవమహాసభ సమావేశంలో బర్ల జగదీష్ యాదవ్ తదితరులు